# మధురము కాదా!

-ఆర్.వి.చలపతి

"భానూ!

ఉభయ కుశలోపరి. అవునే. నీకెన్నిసార్లు ఫోన్ చేయాలి? ఎప్పుడు చేసినా నీ ఇంటి ఫోను ఉపయోగంలో లేదని సమాధానం వస్తుంది. బిల్లు కట్టలేదా ఏమిటి? లేకపోతే పాదుపు ఉద్యమం ఏదన్నా ప్రారంభించారా? పోనీలే అని సెల్‌ఫోన్‌కు చేస్తే అది ఎప్పుడూ స్విచ్ఆఫ్ చేయబడినట్లుగా సమాధానం. ఎవరితోనూ మాట్లాడకూడదనుకున్నావా ఏంటి? నాలుగురోజులు ఫోన్ చేయకుంటే అలిగేదానివి. ఇప్పుడు ఫోన్ మీద ఫోన్ అందనే అందనంటావు. పదిరోజులుగా ప్రయత్నం చేసీ చేసీ చివరికి ఈ ఉత్తరం రాస్తున్నాను.

మా అమ్మాయికి సంబంధం కుదిరింది. వచ్చే వైశాఖంలో పెళ్లి పెట్టుకుందామనుకుంటున్నాము. అబ్బాయి బావున్నాడు. నెల్లూరు గవర్నమెంటు హాస్పిటల్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఒకే ఒక చెల్లెలు. ఆ అమ్మాయికీ పెళ్లయిపోయింది. అమ్మా నాన్నా ఉన్నారు. చాలా మంచి కుటుంబం. ఇంతకూ ఈ సంబంధం తెచ్చిందెవరో తెలుసా?

మన వూరి మాజీ మునసబుగారి అబ్బాయి ప్రతాప్. నీకు గుర్తున్నాడా? గుర్తు లేకుండా ఎలా ఉంటాడులే? మనం కాలేజీలో చదువుకునేటప్పుడు నన్ను ప్రేమిస్తున్నానని వెంటబడేవాడు. ఈమధ్యే అనుకోకుండా మా ప్రక్కింట్లో చేరాడు. ఇంతకుమునుపు నెల్లూరులో పని చేసేవాడట. బదిలీపై ఇక్కడికి వచ్చాడు.

మునుపులాగా లేడే. పక్కా గృహస్థు. మొదటిసారిగా నన్ను చూసినప్పుడు ఆశ్చర్యపోయి వాళ్లింటికి పిలిచి భార్యకు కూడా పరిచయం చేసాడు.

"ఒకప్పుడు పాపం ఈవిడను ప్రేమించి వెంటబడి ఎంత ఏడిపించుకు తిన్నానో" అని భార్యతో చెప్పి పడీ పడీ నవ్వాడు.

"అదంతా ఒక వయసు చేష్టలండీ. ఇప్పుడు తలచుకుంటే నాకే నవ్వొస్తుంది. పాపం! మీరు ఎంత ఇబ్బంది పడ్డారో! అన్నట్లు ఎప్పుడూ మీతోపాటు ఉండేవారే భానుమతిగారని, ఆవిడ ఎక్కడున్నారు ఇప్పుడు? నేను మీ వెంటబడినప్పుడల్లా మీరు భయంతో బిగుసుకుపోతే ఆవిడే కదా నన్ను పట్టుకుని దులిపేవారు. చాలా ధైర్యస్థురాలు" అని నీకు సర్టిఫికెట్ కూడా ఇచ్చాడేవ్. అన్నట్లు మూడురోజుల క్రితం నేను మన వూరెళ్లాను. మీ అమ్మావాళ్లను కూడా అడిగాను నీకేమైనా ఫోన్ చేసారా అని. నాకు ఫోన్‌లో అందని దానివి వాళ్లకు మాత్రం ఎలా అందుతావు నా బుద్ధితక్కువతనం కాకపోతే. మీ అమ్మ కూడా నీకు ఉత్తరం రాయాలనుకుంటున్నట్లు చెప్పారు.

మనం చిన్నప్పుడు ఆడుకునేవాళ్లం చూడు కాలువ గట్టున శివాలయం. అక్కడికీ వెళ్లాను. భానూ! మన చిన్నప్పటిలాగా లేదే. ఇప్పుడు బాగా మారిపోయింది. జనాలు బాగా వస్తున్నారు. గుడి మొత్తం శుభ్రంగా ఉంది. మనం ఆడుకున్నట్లు అక్కడ పిల్లలు ఎవ్వరూ ఆడుకోవడంలేదు.

అంటే వాళ్లను ఆడుకోనివ్వడంలేదు. సాయంత్రం దీపాలు పెట్టగానే కొబ్బరికాయ కొట్టి మనకు ఆ పూజారిగారు ప్రసాదం ఇచ్చేవారు కదా. ఇప్పుడలా కొబ్బరికాయ ప్రసాదమంతాలేదు. పులిహోర, చక్కెరపొంగలి లాంటి ప్రసాదాలు మాత్రమే. అదీ మనం డబ్బులు పెట్టి కొనుక్కోవాలి.

ఇంకో రెండునెలల్లో ఆ గుడికి కుంభాభిషేకం చేయబోతున్నారట. అప్పుడు మనం వెళ్లి చిన్నప్పటిలా అల్లరి చేయాలి. ఎవరు అడ్డం వస్తారో చూద్దాం. గుడి ఆవరణలో నందివర్ధనం చెట్లు విరగబూస్తున్నా వాటిని ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. మనం ఆ పూలన్నీ కోసి దండకట్టి పూజారికి ఇచ్చేవాళ్లం కదా. ఇప్పుడు మళ్లీ ఆ పని చేయాలి. కుంభాభిషేకం ఎప్పుడో కనుక్కొని ఉత్తరం రాయమని మీ అమ్మతో చెప్పాను. నువ్వు ఎలాగైనా వీలు చూసుకుని వస్తావుకదూ!

అబ్బ! చేతివేళ్లు నొప్పెడుతున్నాయే భానూ! ఇలా రాయడం అలవాటు తప్పిపోయింది కదా. ముందు నువ్వు నీ ఫోను కథేమిటో చూడు. సెల్‌ఫోన్ స్విచ్ఆఫ్ చేయబడిందని ఈసారి సమాధానం వస్తే నేరుగా వచ్చి దాన్ని పగలగొట్టేస్తాను. తెలుసుకో. ఎప్పుడూ స్విచ్ఆఫ్ చేసి పెట్టడానికి సెల్‌ఫోన్ ఎందుకే నీకు దండుగ. ఈ ఉత్తరం అందిన వెంటనే ఫోన్ చేయి. లేదంటే చంపేస్తాను. ఉంటాను మరి.

నీ
గిరిజ"

★★★

"గిరిజా రాక్షసీ!

నీ ఉత్తరం అందిన వెంటనే ఫోన్ చేయకుంటే చంపేస్తానని రాసావు. నీ ఉత్తరం నాకు సోమవారం అందింది. దానికి బదులు రాయడానికీ, అది నీకు చేరడానికీ శుక్రవారం దాకా టైం పడుతుందని తెలుసు. అయినా నేను ఫోన్ చేయలేదు. ఉత్తరమే రాస్తున్నాను.

ఈమధ్య తపాలాశాఖవారికి పని తగ్గిపోయిందనీ, వాళ్ల చేత వేరేవేవో పనులు చేయించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు వార్తలు చదువుతుంటాం. వారికి పని కల్పించడం కోసమైనా ఈ ఉత్తరం రాస్తున్నానుకో.


మన చిన్నతనంలో అందరి ఇళ్లల్లోనూ ఇప్పట్లా ఫోన్లు ఉండేవికావు.సెల్‌ఫోన్లు లేవప్పుడు. నా పెండ్లినాటికి మా ఇంట్లోనూ, మీ ఇంట్లోనూ కూడా ఫోన్లు వచ్చాయి. మా అత్తగారింట్లోనూ ఉండేది.

మావారు ఎప్పుడూ క్యాంపులకు వెళ్లినా ఫోన్ చేసి మాట్లాడుతుండేవారు. అదీ మా మామగారితోనూ, అత్తగారితోనూ మాట్లాడి తరువాత నాతో నాలుగు ముక్కలు మాట్లాడేవారు.అదే అలవాటు, మా అత్త, మా మామగార్లు




చనిపోయాక కూడా ఫోన్లలోనే పరామర్శింపులు, 'ఎలా వున్నావు? బాబు ఏం చేస్తున్నాడు? నేను నాలుగురోజుల్లో వచ్చేస్తాను జాగ్రత్త' అని. అంతే నెలక్రితం ఒకరోజు మా ఫోను నాలుగురోజులుగా డెడ్ అయింది. నా సెల్ ఫోన్ స్విచ్ఆఫ్ చేసి పెట్టానేమో క్యాంపుకెళ్లిన మావారు ఫోను మీద ప్రయత్నం చేసీ చేసీ విసిగిపోయి ఉత్తరం రాసారు.

గిరిజా! ఫోనులో ముక్తసరిగా మాట్లాడే వారు ఉత్తరం ఎలా రాసారంటే అబ్బో దాన్ని నేను దాచి పెట్టుకుని వారంరోజులపాటు మళ్లీ మళ్లీ చదువుకున్నాననుకో. అంత ఇదిగా ఏం రాసారని అడిగావంటే నిన్ను ఖూనీ చేసేస్తాను. అది మా భార్యాభర్తలకే పరిమితమైన ఆపాత మధురమైన... అరె...నాక్కూడా కవిత్వం వచ్చేస్తుందేవ్. వారు రాసిన ఆ ఉత్తరం చదివాక నాకూ కాస్త కవితావేశం అంటుకున్నదేమోనే. అప్పుడు తెలిసింది నాకు ఫోన్‌లో మాట్లాడుకోవడానికీ, ఉత్తరాల్లో పలకరించుకోవడానికి తేడా. నువ్వు నాకు ఫోన్ చేస్తావనుకో అప్పుడు నేను ఒంటరిగానే ఉంటానని చెప్పగలమా?



## సంతోషంలో కామ్నా

ఆమధ్య కొంత గ్యాప్ వచ్చాక కామ్నా జెఠ్మలానీ 'అందమైన అబద్ధం', 'మెంటల్ కృష్ణ' లాంటి సినిమాలతో పాటు మరో పేరు నిర్ణయించని రెండు సినిమాలు చేస్తోంది. వీటితోపాటు మరికొన్ని చాన్సులు కూడా ఆమె ముంగిట నిలిచి వున్నాయిట. వీటిలో ఏ ఒక్కటి హిట్టయినా చాలు, ఆమె కెరీర్ ఝూమ్మంటూ ఊపందుకుంటుంది. అందుకే ఆమె ఇప్పుడు ఎంతో సంతోషంగా వుంది.




ప్రక్కన ఎవరో వుండవచ్చు. అప్పుడు మనసువిప్పి మాట్లాడుకోగలమా? ఒకవేళ నేను అప్పుడు బయట ఎక్కడో వేరే ముఖ్యమైన పనిలో ఉంటాననుకో...అప్పుడేం చేస్తాను. నేను తిరిగి ఫోన్ చేస్తానులే అని చెప్పి కట్ చేయాల్సి వస్తుంది. మళ్లీ నేను నీకు ఫోన్ చేసేటప్పటికి నువ్వు మాట్లాడదలచుకున్నది నువ్వు మరచిపోవచ్చు. ఉత్తరాల్లో అలాకాదుకదా. తీరిగ్గా కూర్చుని మనసువిప్పి అక్షరాల ద్వారా మాట్లాడుకోలేని మధురమైన ఆలోచనలు ఉంటాయా!

అందుకే మా ఫోన్ డెడ్ అయినా నేను పట్టించుకోలేదు. నా సెల్‌ఫోనూ ఆన్‌లో ఉంచలేదు. మొన్న నీ ఉత్తరం చూసాక నేను చేసిన పని ఎంత మంచిదో ఇంకా బాగా తెలిసివచ్చింది. ఇక నేను ఫోన్ వాడనుకాక వాడను. ఏదో గ్యాస్ అయిపోతే రీఫిల్ బుక్ చేసుకోవడానికీ, మావారికోసం ఎవ్వరైనా అడిగితే బదులు చెప్పడానికీ అటువంటి అవసరాలకే అది పరిమితం. అంతకు మించి నేను ఇంక ఫోను వాడదల్చుకోలేదు. ఈ ఫోన్‌లవల్ల హలో అంటే హలో అనే మాటలే తప్ప మన మనసులోని భావాలను వ్యక్తం చేసుకోవడానికి అవకాశమే ఉండడంలేదు. మావారికి ఎటూ వేరే సెల్‌ఫోన్ ఉంది కాబట్టి ఇబ్బంది ఏమీలేదు.

తీయతీయని కబుర్లతో ఆత్మీయుల నుండి, స్నేహితుల నుండీ ఉత్తరాలు అందుకోవడం, వాటిని పదిలంగా దాచుకుని మళ్లీ మళ్లీ చదువుకోవడం, తిరిగి ఎప్పుడు ఉత్తరం వస్తుందా అని వేయి కళ్లతో ఎదురుచూడ్డం ఇవన్నీ ఇప్పటి జనరేషన్ పోగొట్టుకున్న మధురాతి మధురమైన అనుభవం అనిపిస్తుంది నాకు.

వీళ్లకు ఆ అనుభవం గురించి తెలియదు. తెలిసిన మనం దాన్ని ఎందుకు వదులుకోవాలి? ఫోన్‌లో మాట్లాడేటప్పుడు ఎదుటివారి మాటలు వినడంమీదే మన మనసు కేంద్రీకరించబడి ఉంటుంది. అయితే ఉత్తరాలు చదివేటప్పుడు వాళ్ల రూపం మన మనోనేత్రాలకు కనిపిస్తూ ఉంటుంది. చిన్ననాటి కబుర్లు అవీ చదువుకునేటప్పుడు మనం మళ్లీ అందమైన గతంలోకి వెళ్లిపోతుంటాం.

మన వూరి ఆలయం కుంభాభిషేకానికి తప్పకుండా వస్తాను. చిన్నప్పుడు మనం గుళ్లో చేసిన హడావిడిని మళ్లీ జ్ఞాపకం చేసుకుందాం. మళ్లీ మన స్నేహితురాళ్లందరినీ కలిపి ఆనాటి జ్ఞాపకాలను తిరగతోడుకోవాలని ఉంది. మళ్లీ మనం చిన్నపిల్లలమైతే ఎంత బాగుండునో అన్పిస్తుంది. ఆ వయసులో ఎలాంటి బాధ్యతలులేవు. చక్కగా ఆడుతూ పాడుతూ ఎంజాయ్ చేసేవాళ్లం. మళ్లీ ఆనాటి మధురమైన రోజులు మళ్లీ రావుకదా? నాకైతే ఎప్పుడెప్పుడు మన ఊరికి వెళ్దామా అని వుంది. అందాకా మనం ఉత్తరాల్లోనే మాట్లాడుకుందాం.

అదిగో... బయట ఎవడో 'అమ్మా! భోజనం చేసి రెండురోజులైంది తల్లీ' అని అడుక్కుంటున్నాడు. నాకేమో ఫోన్ చేసి రెండురోజులైంది అంటున్నట్లుగా ఉంది. అలా అయిపోయింది మన ఫోన్ల పరిస్థితి. మనసు విప్పి మాట్లాడుకోడానికి ఉత్తరాలను మించిన మధురమైన మార్గం ఉందా? చెప్పు. నా ఉత్తరం అందగానే వెంటనే రిప్లై ఇవ్వాలి సుమా. ఆలస్యం చేస్తే నిన్ను క్షమించేది లేదు. ఇప్పటి నుంచీ నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ ఉంటాను. మీ అమ్మాయి పెళ్లి ఏర్పాట్లలో రాయడం మరచిపోయేవు సుమా!

నీ
భానుమతి

★